సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 20 । జూలై । 2023



ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ..

అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విజయనగరంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. - 8లో



24 నుంచి ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్

ఏపీ ఈఏపీ సెట్-2023 (ఎంపీసీ స్ట్రీం) ప్రవేశాల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 24 నుంచి ఆగస్టు 9 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. - 8లో

నేడు తోటపల్లి పాత ఆయకట్టుకు నీరు

వీరఘట్టం: ఖరీఫ్ పంటల సాగుకు తోటపల్లి ప్రాజెక్టు నీటిని గురువారం విడుదల చేయనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. జలాశయంలో పుష్కలంగా నీరు ఉందని, పార్వతీపురం మన్యంతో పాటు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 64వేల ఎకరాల పాత ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. తొలుత శివారు ఆయకట్టుకు సాగునీరందించే ప్రధాన చెరువులకు తోటపల్లి నీటిని మళ్లించనున్నారు.

న్యూస్‌రీల్

రెండు రోజుల్లో అభిప్రాయం చెప్పండి



పోర్టు రోడ్డు ప్రభావిత భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

టెక్కలి: మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా టెక్కలి మీదుగా గుర్తించిన రోడ్డుకు సంబంధించి ప్రభావిత రైతులంతా అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్పాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. టెక్కలి మండలం మోదుగువలస, బన్నువాడ గ్రామాల్లో పోర్టు రోడ్డు కోసం గుర్తించిన పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో ఇప్పటికే అనేక సార్లు చర్చలు జరిపామని గుర్తు చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం రైతులంతా ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. భూసేకరణ చట్టం ప్రకారం పరిహారాన్ని నిర్ణయించామని పేర్కొన్నారు. భూములిచ్చే విషయంలో రెండు రోజుల్లోగా అభిప్రాయాన్ని వ్యక్తం చేయాలన్నారు. అనంతరం రెండు గ్రామాలకు చెందిన రైతులంతా తమ ఆవేదనను కలెక్టర్‌కు విన్నవించారు. ఈయనతో పాటు సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఉన్నారు.

ఎస్పీని కలిసిన సీసీఎస్ సీఐ

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం వీఆర్ నుంచి బదిలీల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా వి.బాబ్జీరావు బుధవారం విధుల్లో చేరారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ విధులకు సంబంధించి సలహాలు, సూచనలు అందజేశారు. అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామిలను కూడా సీఐ కలిశారు.

ఏసీఏ నార్త్‌జోన్ క్రికెట్ సీనియర్స్ విజేతగా సిక్కోలు



విజయానందంలో జిల్లా జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు యువ క్రికెటర్లు సరికొత్త చరిత్రను లిఖించారు. శ్రీకాకుళం జిల్లా సీనియర్స్ క్రికెట్ జట్టు నార్త్‌జోన్ టోర్నీలో విజేతగా నిలిచి రికార్డు సృష్టించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో విజయనగరంలో నాలుగు రోజులుగా జరిగిన ఏసీఏ నార్త్‌జోన్ సీనియర్స్ పురుషుల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీకాకుళం జట్టు చేజిక్కించుకుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టిగా రాణించి మొత్తం మూడు మ్యాచ్‌ల్లో రెండింటిలో ఘన విజయం సాధించగా, మరో మ్యాచ్ వర్షం కారణంగా నిలిచిపోయి.. ఆ మ్యాచ్ ఫలితం వెల్లడికాలేదు. దీంతో శ్రీకాకుళం జిల్లా జట్టు మొత్తం 10 పాయింట్లతో టోర్నీలో విజేతగా నిలిచింది. తూర్పుగోదావరి 6 పాయింట్లతో రెండోస్థానం, ఆతిథ్య విజయనగరం 2 పాయింట్లతో మూడో స్థానం, డిఫెండింగ్ ఛాంపియన్ విశాఖపట్నం 2 పాయింట్లతో ఆఖరిస్థానంతో సరిపెట్టుకుంది.


ఉద్దానంలో ఉచిత రక్త పరీక్షలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ రోగ నివారణలో భాగంగా ఈ నెల 22న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డీఎంహెచ్‌వో కార్యాలయం ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధి నిర్ధారణకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శ్రీకాకుళంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కవిటి మండలం మాణిక్యపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కంచిలి మండలం ఎంఎస్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు, ఉచిత మందుల సరఫరా, అవగాహన సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఉద్దానం ప్రాంతంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తొమ్మిది మెడికల్ క్యాంపులు నిర్వహించిందని, 3151 మందికి రక్త పరీక్షలు చేయగా 263 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులను గుర్తించామని వివరించారు. ముందస్తు రక్త పరీక్షల వల్ల వ్యాధిని గుర్తించి సకాలంలో బయటపడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

వలను చించేస్తూ.. భూమిని చీలుస్తూ..



పలాస ఎర్రచెరువు వద్ద అరుదైన చేప

చిత్రంలో మీరు చూస్తున్నది చేప. కానీ ఇది కొంచెం వైల్డ్. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రచెరువులో బుధవారం దర్శనమిచ్చింది. మామూలు చేపలతో పోలిస్తే విభిన్నంగా కనిపించడంతో ప్రజలు దీనిని చూసేందుకు ఆసక్తి చూపారు. ఈ చేప కోసం పరిశోధకుల్ని సంప్రదిస్తే వారు బోలెడు విషయాల్ని వివరించారు. – కాశీబుగ్గ

ఇదీ చేప కథ..

శాస్త్రీయ నామం: టెరిగో ప్లిక్టీస్ పరదాలిస్

వ్యవహారిక నామం: అమెజాన్ అంటుబిల్ల.. సెయిల్ ఫిన్ క్యాట్ ఫిష్

- నీటి అడుగు భాగంలో బొరియలు చేస్తాయి. తద్వారా జీవవైవిధ్యం దెబ్బతింటుంది.
- మత్స్యకారుల వలలను తమ శరీర భాగాలతో చించేస్తాయి.
- ఈ చేపల్ని పక్షులు ఆరగిస్తే వాటి ఆహార నాళం చిరిగిపోయి మరణిస్తాయి.
- ఇది విదేశాలకు చెందినది. అక్వేరియంలో పెంచేందుకు దీనిని గతంలో భారత్‌కు తీసుకొచ్చారు. అక్వేరియంలో ఉండే నాచు పదార్థాన్ని తిని శుభ్రపరచడం దీని ప్రత్యేకత.
- నీరు లేకపోయినా ఎక్కువ సేపు బయట బతకగలగడం మరో ప్రత్యేకత.
- మన దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, వెస్ట్‌బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఇవి కనిపిస్తాయని జీవ వైవిధ్య శాస్త్రవేత డాక్టర్ కర్రిరామారావు 'సాక్షి'కి వివరించారు. 2014లో దీనిని తెలంగాణలో తొలిసారి గుర్తించినట్లు ఆయన తెలిపారు.

కత్తులు దూస్తున్నారు...

ఇదేం ఖర్మ సారూ..!

గుండ వర్సెస్ గొండు

- పోలీసు స్టేషన్‌కు చేరుతున్న శ్రీకాకుళం టీడీపీ విభేదాలు
- ఇటీవల 'ఇదేం ఖర్మ' నిర్వహణలో గొడవలు
- బెదిరింపుల నేపథ్యంలో పోలీసు స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు
- తాజాగా గొండు శంకర్ ఫ్లెక్సీలను చించేసిన గుండ లక్ష్మీదేవి వర్గీయులు
- గార పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గొండు శంకర్ వర్గీయులు
- నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్య



గార పోలీసు స్టేషన్‌లో గుండ లక్ష్మీదేవి వర్గీయులపై ఫిర్యాదు చేసిన గొండు శంకర్ వర్గీయులు

పొలిటికల్ వాచ్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీలో అంతర్గత పోరు రోజురోజుకు తీవ్రమవుతోంది. తాడోపేడో తేల్చుకోవడానికి ఇరువర్గాలు కత్తులు దూసుకుంటున్నాయి. అంతు చూస్తాం.. హతమారుస్తాం అనే వరకు వెళ్లిపోయారు. ఆ మధ్య 'ఇదేం ఖర్మ' నిర్వహించే విషయంలో విభేదాలొచ్చి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా ఫ్లెక్సీల విషయంలో పోలీసులను ఆశ్రయించారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి వెళ్లడంతో ఇదేం కర్మ అని అటు నియోజకవర్గ ప్రజలు, ఇటు పోలీసులు తలలు పట్టుకోవాల్సి వస్తోంది. సాధారణంగా పార్టీలో అసమ్మతి చెలరేగితే పార్టీ అధిష్టానం సర్ది చెప్పాలి. కానీ, శ్రీకాకుళం టీడీపీ నేతల పోరును పోలీసుస్టేషన్‌లో పంచాయితీ చేయాల్సి రావడం గమనార్హం.

ఎన్నాళ్లీ ఊడిగం..

నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీ దంపతులు, గొండు శంకర్ వర్గీయుల మధ్య తీవ్ర పోరు నడుస్తోంది. కాలం చెల్లిన నేతలు ఇంకెంత కాలం నాయకత్వం వహిస్తారని, ఎన్నాళ్లు వారికి ఊడిగం చేయాలని గొండు శంకర్ వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే సీటు లక్ష్మీదేవికి ఇవ్వొద్దని, తమకే కేటాయించాలని గొండు శంకర్ వర్గీయులు డిమాండ్ చేయడమే కాకుండా అధిష్టానం దూతలను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. అంతు చూస్తామంటూ వార్నింగ్‌లు కూడా ఇచ్చుకుంటున్నారు.

గతంలోనూ ఇదే పరిస్థితి..



గార మండలం అంపోలు పంచాయతీలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి సన్నద్ధమవ్వగా, ఇక్కడ చేయడానికి వీల్లేదని గొండు శంకర్ వర్గీయులు అడ్డు తగిలారు. లక్ష్మీదేవి అనుచరుడు వెలమల శ్రీనివాసరావు నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నించగా, గొండు శంకర్ అనుచరులైన మూర్తి, అచ్యుతరావులు అడ్డుకునేందుకు యత్నించారు. ఫోన్, వాట్సాప్ ద్వారా ఎవరు అడ్డుకుంటారో చూస్తామని లక్ష్మీదేవి వర్గం, ఎవరొచ్చి నిర్వహిస్తారో చూస్తామని గొండు శంకర్ వర్గీయులు వాదించుకున్నారు. ఈ క్రమంలో ఓ వర్గానికి చెందిన వారిని మరో వర్గానికి చెందిన నాయకులు ఇటీవల జరిగిన రామశేషు హత్య మాదిరిగా హతమార్చేస్తామని బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలో అంపోలులో పార్టీ కార్యక్రమానికి బందోబస్తు కావాలని, తమను అడ్డుకోవడానికి గొండు శంకర్ వర్గీయులు ప్రయత్నిస్తున్నారని లక్ష్మీదేవి వర్గం శ్రీకాకుళం రూరల్ సీఐకు ఫిర్యాదు చేశారు. దీనికి కౌంటర్‌గా గొండు శంకర్ వర్గీయులు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవి తమను బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కాస్త సీరియస్‌గానే స్పందించారు. పార్టీ కార్యక్ర మం నిర్వహించుకుంటే ఫర్వాలేదని, గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాజాగా ఫ్లెక్సీల గొడవ..

గొండు శంకర్ పుట్టిన రోజు సందర్భంగా గారలో ఆయన అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని గుండ లక్ష్మీదేవి వర్గీయులు పట్టపగలే చించేసి తొలగించారు. తోటి కార్యకర్తలు చూస్తుండగానే లక్ష్మీదేవి అనుచరులైన మండల పార్టీ కార్యదర్శి జల్లు రాజీవ్, శ్రీకూర్మం మాజీ ఎంపీటీసీ కైబాడీ రాజులు కలిసి గొండు శంకర్ ఫ్లెక్సీలు చించేయడమే కాకుండా లక్ష్మీదేవికి వ్యతిరేకంగా పనిచేసే వారికి బుద్ధి చెబుతామని, ఏమాత్రం మర్యాద లేకుండా వ్యవహరిస్తామని హెచ్చరించారు. దీంతో గొండు శంకర్ వర్గీయులు ఘాటుగా స్పందించారు. మేమేంటో తేల్చుతామని అంటూనే గార పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొండు శంకర్ వర్గీయులైన గార మాజీ సర్పంచ్ బడకల వెంకట అప్పారావు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ రమణమూర్తి ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

తమాషా చూస్తున్న అధిష్టానం..

నేతల మధ్య తారస్థాయికి విభేదాలు చేరడంతో అక్కడి టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. వీరి మధ్య గొడవతో ఎవరికి ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇదంతా అధినేతల డైరెక్షన్‌లో జరుగుతోంది. గొండు శంకర్ వర్గీయులకు అండగా కింజరాపు అచ్చెన్నాయుడు, గుండ లక్ష్మీదేవికి అండగా కళా వెంకటరావు ద్వారా నారా లోకేష్ అండదండలుండటంతో ఎవరికి వారే బరితెగించి 'ఫైటింగ్' చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎక్కడైనా పార్టీలో విభేదాలుంటే అధిష్టానం చొరవచూపి పరిష్కరించాలి. ఇక్కడ మాత్రం అధిష్టానం పెద్దలే వెనకుండి తమాషా చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించి వారికున్న భయాలకు రక్షణ కల్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తున్నారు. దీన్నిబట్టి శ్రీకాకుళం టీడీపీ గొడవలు ఏ స్థాయికి వెళ్తాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఏదో ఒక రోజు కేడర్ ప్రాణాలకు ముప్పు వచ్చే ప్రమాదం ఉందన్న అభిప్రాయం టీడీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. వీరి వల్ల నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్య ఏర్పడుతోంది. అసాంఘిక శక్తుల మాదిరి వ్యవహరిస్తుండటంతో ప్రజలకు కూడా ఇబ్బందికరంగా పరిణమించింది.

కా మెంట్ బాక్స్

సామాన్యుడి సంక్షేమం కోసమే..



మార్కెట్లో లభించే ప్రతి నిత్యవసర వస్తువును సామాన్యుడు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వస్తు ఉత్పత్తి తగ్గినప్పుడు డిమాండ్ క్రమంగా పెరుగుతుంది. ఇది సహజం. అటువంటి నిత్యావసర సరుకులను ప్రభుత్వమే కొనుగోలు చేసి సబ్సిడీతో సామాన్యులకు అందించడం ఒక్క మన ప్రభుత్వమే చేస్తోంది.
– తమ్మినేని సీతారాం, శాసన సభ స్పీకర్
(ఆమదాలవలస రైతుబజార్‌లో సన్న బియ్యం అమ్మకాల ప్రారంభోత్సవంలో..)

మోసకారి బాబుకు మరో అవకాశమా?



గతంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాలను మోసగించిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ మరోఅవకాశం ఇవ్వాలని ప్రజలను కోరడం సిగ్గుచేటు. నిత్యావసర సరుకుల ధరలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయి. వీటిపై విపక్షాలు చేస్తున్న విష ప్రచారం నమ్మవద్దు. ఒకప్పుడు పథకాలు అందాలంటే లంచం ఇవ్వాల్సిందే. ఇప్పుడా పరిస్థితి లేదు.
– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి
(శ్రీకాకుళంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో)

మోసగించడంలో బాబు సిద్ధహస్తుడు



ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడు. అధికారం కోసం ఎన్ని అడ్డదారులనైనా తొక్కడానికి వెనుకంజ వేయడు. ఒక వేళ చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వస్తే జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలకు మంగళం పాడేస్తాడు. వలంటీర్లపై చంద్రబాబు, దత్తపుత్రుడు నీచమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు.
– డాక్టర్ సీదిరి అప్పలరాజు, రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి
(వజ్రపుకొత్తూరు మండలం పెదబడాంలో నిర్వహించిన కార్యక్రమంలో)

మీ భవిష్యత్తుకే గ్యారెంటీ లేదు



రాష్ట్రంలో 14 ఏళ్లు అధికారంలో ఉన్న టీడీపీ ఏం ఒరగ బెట్టిందో ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు ప్రజలకు భవిష్యత్తు గ్యారెంటీ అంటూ గ్రామాల్లో బస్సు యాత్రలు చేస్తున్నారు.. మీ భవిష్యత్తుకే గ్యారెంటీ లేదు. మీరు ప్రజలకేమి ఇవ్వగలరు. రానున్న ఎన్నికల తరువాత టీడీపీ ఖాళీ అవుతుంది. టీడీపీ పని అయిపోయింది. – ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు
(సత్యవరంలో ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవంలో)

బస్తా జీడిపిక్కలకు రూ.9 వేలు

- ఉద్దానం రైతులతో మంత్రి సీదిరి అప్పలరాజు
- రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు
- కలెక్టర్ సమక్షంలో వ్యాపారులతో చర్చలు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు. చిత్రంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

పలాస : ఉద్దానం ప్రాంతంలో జీడి పండించే రైతులకు గిట్టుబాటు ధర విషయంలో రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు భరోసా ఇచ్చారు. 80 కిలోల జీడి పిక్కల బస్తా ధర ఈ ఏడాది రూ.9వేలుకు పలాస జీడి వ్యాపారులు కొనుగోలు చేయాలని చెప్పారు. అందుకు వ్యాపారులు అంగీకారం తెలిపారు. పలాస నియోజకవర్గంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పిక్కలను కొనుగోలు చేయాలన్నారు. పలాస తహశీల్దారు కార్యాలయంలో బుధవారం కలెక్టరు శ్రీకేష్ బి.లాఠకర్ సమక్షంలో పలాస జీడి వ్యాపారులతో చర్చలు నిర్వహించారు. జీడి పప్పు ధరలు తగ్గడానికి గల కారణాలను వ్యాపారులు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీడి పిక్కల ధర గురించి చర్చించడానికి వచ్చామని, ఇది నిర్ణయం కాదన్నారు. విదేశీ పిక్కలు చౌకగా వస్తున్నాయనే విషయం పక్కన పెట్టి ఇక్కడ రైతులకు కూడా తగిన న్యాయం చేయాలని, ఆ దిశగా వ్యాపారులు ఆలోచించాలని కోరారు. వ్యాపారుల కష్టాలు విన్న తర్వాత మంత్రి మాట్లాడుతూ నియోజక వర్గంలో సుమారు లక్ష జీడి పిక్కల బస్తాలు ఉన్నాయని, వాటిని రైతు భరోసా కేంద్రాల వద్ద కొనుగోలు చేయాలని చెప్పారు. పలాసలో సుమారు 300 జీడి పరిశ్రమలు ఉన్నాయని, ఈ పరిశ్రమదారులకు ఏడాదికి కావలసిన మొత్తం పిక్కల్లో ఉద్దానంలో పండిన పిక్కలు 10 శాతం మాత్రమేనని, ఇవి కొనుగోలు చేయడం వ్యాపారులకు పెద్ద కష్టం కాదన్నారు. అనంతరం ఉద్దానం జీడి రైతుల సంఘం కన్వీనర్ తెప్పల అజయ్ మాట్లాడుతూ రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ గత ప్రభుత్వాల కంటే రైతులకు మన ప్రభుత్వం చాలా ఎక్కువ మేలు చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో పలాస ఆర్డీవో టి.సీతారామ్మూర్తి, తహశీల్దార్ మధుసూదనరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.వి.సతీష్, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల చిట్టి, కాష్యూ అసోసియేషన్ ప్రతినిధులు మల్లా సురేష్, మల్లా రామేశ్వరరావు, కె.వి.శివ, తూముల శ్రీనివాసరావు, పట్నాన రవి, మల్లా భాస్కరరావు, ఉంగ సాయికృష్ణ, బత్తిన లక్ష్మణ, రైతు ప్రతినిధులు దాసరి శ్రీరాములు, కుత్తుం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న జీడి పరిశ్రమలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో జీడి పరిశ్రమలు మంత్రి అప్పలరాజు చొరవతో బుధవారం తెరుచుకున్నాయి. జూలై 5 నుంచి పరిశ్రమలు మూతపడిన సంగతి తెలిసిందే.

ముంపులో తంపర భూములు



కోవిలాం సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

ఎల్.ఎన్.పేట: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు తంపర పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. ఎల్.ఎన్.పేట మండలంలోని కోవిలాం, రావిచెంద్రి, ధనుకువాడ, చిట్టిమండలం, దబ్బపాడు, వాడవలస, సిద్ధాంతం తదితర గ్రామాల పరిధిలో పంట పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజులు నీరు నిలిచి ఉంటే మొలక దశలో ఉన్న ఖరీఫ్ వరికి నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదనీరు వెళ్లేందుకు దారిలేకపోవటంతో సమస్య ఏర్పడుతోందని చెబుతున్నారు.

ఒకే బండి.. ఫైన్లు 33



ద్విచక్రవాహనాన్ని పట్టుకున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ పున్నయ్య

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ ద్విచక్ర వాహనచోదకుడిని తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఆపగా 33 ఫైన్లు పెండింగ్‌లో ఉండటంతో అవాక్కయ్యారు. విశాఖపట్నం రిజిస్ట్రేషన్ చూపిస్తున్న స్కూటీకి వితౌట్ ఇన్సూరెన్సు, వితౌట్ లైసెన్సు, రాంగ్‌పార్కింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్‌రైడ్, రాంగ్ రూట్ తదితర చలానాలున్నాయి. రూ.8 వేలకు పైగా జరిమానా కట్టాల్సి ఉంది. వాహనదారుడిని పోలీసులు విచారించగా తన అత్త విశాఖపట్నంలో ఉంటున్నారని, ఆమె అక్కడ రిజిస్ట్రేషన్ చేయించిందని చెప్పగా వివరాలు సరిపోయినట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. వెంటనే బండిని హెడ్ కానిస్టేబుల్ పొలుమట పున్నయ్య టోయింగ్ టూ డ్రైవర్ మోహన్ ద్వారా ట్రాఫిక్ పీఎస్‌కు తరలించారు. చలానాలు అన్నీ కట్టేసి పోలీస్ స్టేషన్‌లో విడిపించుకోవాలని వాహనదారుడికి చెప్పారు.

జెడ్పీ యూనిట్ మినిస్టీరియల్ సంఘ అధ్యక్షుడిగా అప్పన్న



కొత్తగా ఎన్నికైన పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సభ్యులు వీరే..

అరసవల్లి: జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో భాగంగా జెడ్పీ యూనిట్ సమితి అధ్యక్షునిగా దుంపల అప్పన్న (జెడ్పీ చైర్‌పర్సన్ సీసీ) 42 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఉపాధ్యక్షునిగా మాసపు సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శిగా కె.రామేశ్వరరావు 19 ఓట్ల మెజార్టీతో , కోశాధికారిగా కె.లక్ష్మణరావు 17 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.దేవేంద్ర వర్మ (జెడ్పీ సీఈఓ సీసీ), జాయింట్ సెక్రటరీగా సోమేశ్వర పాడి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.వి.రమణ, కౌన్సిలర్లుగా ధర్మాన సుందరరావు, ఎస్‌పీకే రాజు, వి.జగదీశ్వరరావు, వి.మీనాకుమారిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా పి.వెంకటి, ఎం.లక్ష్మీనారాయణ, ఎల్.వెంకట్రామన్, ఎస్.విజయేందర్, ఎం.విజయానందకుమార్ ఎంపిక కాగా, ఎన్నికల అధికారులుగా ఆర్.తిరుపతిరావు, ఆర్.శేషగిరిరావులు వ్యవహరించనున్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల్లో పురోగతి



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : అపరిష్కృతంగా ఉన్న ముఖ్య కేసులను సమగ్ర దర్యాప్తు జరిపి పురోగతి సాధించాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదైన గ్రేవ్, ప్రాపర్టీ నేరాలు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఎన్డీపీఎస్ కేసులతో పాటు ప్రాధాన్యత కేసుల దర్యాప్తు పూర్వాపరాలపై ఆరా తీశారు. నేరాల నివారణకు సబ్‌డివిజన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని, నైట్ బీట్స్ బలోపేతం చేసి తనిఖీలు నిర్వహించాలని, కేసుల దర్యాప్తు, చార్జిషీటు దాఖలు వరకు లోతుగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు (క్రైమ్), జె.తిప్పేస్వామి (అడ్మిన్), డీఎస్పీలు యర్రగుంట శృతి, డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వరరెడ్డి, ఎస్.వాసుదేవ్, ఎస్.బాలరాజు, సీహెచ్‌జీవీవీ ప్రసాదరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్పంచ్ చెక్‌పవర్ పునరుద్ధరణ

ఎచ్చెర్ల క్యాంపస్: బడివానిపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ కారి చిన్నతాతారావు చెక్ పవర్‌ను ఏపీ హైకోర్టు పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు హైకోర్టు న్యాయవాది, ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో సర్పంచ్‌పై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారులు చెక్‌పవర్‌ను రద్దు చేశారు. దీంతో హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు.

'గ్లోబల్ న్యూరోకేర్'లో అరుదైన బ్రెయిన్ సర్జరీ



సర్జరీ చేయించుకున్న అప్పన్నతో వైద్యులు గౌతమ్, ప్రసాద్‌ల బృందం

అరసవల్లి: జిల్లాలో ఉన్న ఆస్పత్రుల్లో అరుదైన సర్జరీలు జరుగుతున్నాయి. తాజాగా మరో ఆపరేషన్‌కు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి వేదికైంది. వివరాల్లోకి వెళితే.. జలుమూరు మండలానికి చెందిన అప్పన్నకు మెదడులో రక్తనాళాల వాపు వ్యాధిగా (బ్రెయిన్ ఎన్యూరిజమ్) నిర్ధారణ అయింది. దీంతో అతను శ్రీకాకుళంలోని గ్లోబల్ న్యూరోకేర్ ఆస్పత్రిని సందర్శించారు. వైద్యులు అరుదైన బ్రెయిన్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసి రోగి ప్రాణాలను నిలిపారు. చీఫ్ న్యూరో సర్జన్ డాక్టర్ దేవరెడ్డి గౌతమ్, చీఫ్ అనస్తీషియా డాక్టర్ ఐఎస్‌డీ ప్రసాద్‌ల బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు ఐదు గంటల పాటు మైక్రోస్కోపిక్‌తో నిర్వహించిన ఈసర్జరీతో రోగి పూర్తిగా కోలుకున్నాడని వైద్యుడు గౌతమ్ బుధవారం తెలియజేశారు. రోగి అప్పన్నతో పాటు ఆయన కుటుంబసభ్యులు ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

నాడు-నేడు పనులపై విచారణ



పాఠశాలలో విచారణ చేపడుతున్న అధికారులు

పాతపట్నం: బొమ్మిక గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 2019-20 విద్యా సంవత్సరంలో మొదటి విడతలో చేపట్టిన నాడు-నేడు పనులను సీతంపేట ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. ఈ పనులపై ఈ నెల నాలుగో తేదీన గిరిజన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ ఐటీడీఏ పీవో కల్పనకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పనులను పరిశీలించడంతోపాటు హెచ్‌ఎం ఎం.మార్కెండేయులు, ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ చేపట్టినట్లు డీడీ పేర్కొన్నారు. రూ.61 లక్షలతో చేపట్టిన పనులకు సంబంధించి మరుగుదొడ్లు, ఫర్నీచర్, పెయింటింగ్, విద్యుత్, తాగునీరుతో పాటు వివిధ మరమ్మతుల కోసం చేపట్టిన వాటికి సక్రమంగా రికార్డులు లేనట్టు గుర్తించామన్నారు. ఆడిట్ తన పరిధిలో లేదన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని డీడీ పేర్కొన్నారు. విద్యార్థులకు బోధించే విషయంలో రోజు వారి డైరీ అమలు చేయడం లేదని, దీనిపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఈవో ఎ.లిల్లీరాణి, ఏఎంవో పి.కోటిబాబు, సీఎంవో సీహెచ్ చిరంజీవి, ఎల్.ఉమ ఉన్నారు.

ఐటీఈపీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఐటీఈపీ (నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా శిక్షణ కోర్సు) కోర్సులో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీవరకు పెంచినట్లు బీఆర్ఏయూ వైస్‌చాన్సలర్ నిమ్మ వెంకటరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవంగా ఈ నెల 19వ తేదీతో గడువు ముగిసిందన్నారు. అయితే విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఎన్‌టీఏ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది నుంచి 42 విద్యా సంస్థల్లో ఈ కోర్సు ప్రారంభమవుతుండగా, అందులో వర్సిటీ ఒకటిగా చెప్పారు. డిగ్రీ ప్లస్ బీఈడ్ నాలుగేళ్లలో పూర్తవుతుందన్నారు. బీఏస్సీ ఎంపీసీ, బీఏసీ హెచ్ ఈపీ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధం

- నేటి నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ
- పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై ఆర్మీ అధికారులతో సమీక్షిస్తున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం క్రైమ్: అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఆర్మీ అధికారులతో కలిసి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచి ప్రారంభం కానున్న ఈ ర్యాలీ ఆగస్టు రెండో తేదీవరకూ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్‌టీఆర్ జిల్లా వరకూ సుమారు 8,600 మంది అభ్యర్థులు 14 రోజుల పాటు విజయనగరంలోని పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో నిర్వహించనున్న ఈ ర్యాలీకి హాజరుకానున్నారు. ఇప్పటికే రాతపరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పరుగుపందెం, లాంగ్ జంప్, ఇతర శారీరక దారుఢ్య, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్మీ అధికారులు తుది ఎంపిక చేస్తారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం జేసీ మయూర్ అశోక్, ఆర్మీ రిక్రూటింగ్ అధికారి జీఎస్.రణ్‌ధావా, వినయ్ కుమార్‌లతో కలిసి ర్యాలీ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. పరుగుపందెం, నిర్వహణకు మైదానంలో చేసిన ఏర్పాట్లు, బారికేడ్లు, విద్యుత్ దీపాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటు ,ఎంపికల నేపథ్యంలో అస్వస్థతకు గురైన అభ్యర్థులకు అత్యవసర వైద్యసదుపాయం, బస్టాండ్, రైల్వేస్టేషన్ నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా ఏర్పాట్లు, వర్షాలు కురిసినట్లయితే పరుగుపందెం నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

అభ్యర్థులకు సదుపాయాలు

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశానికి చేరుకునే విధంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. వేదిక వద్దకు చేరుకున్న వెంటనే అభ్యర్థుల ప్రవేశపత్రాలను పరిశీలించి అనంతరం లోపలికి అనుమతిస్తారని, అభ్యర్థులకు 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారని తెలిపారు. ఆర్మీ ప్రమాణాల ప్రకారం ఈ పరుగు పందెంలో ఎంపికైన వారికి లాంగ్ జంప్, మరికొన్ని శారీరక దారుఢ్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీలు ఉంటాయని చెప్పారు. అనంతరం విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఆర్మీ ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అల్పాహారం, భోజన వసతి సమకూరుస్తున్నామన్నారు. ఈ ప్రాంత అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్మీకి అధిక సంఖ్యలో ఎంపికవుతారని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటరమణ, డీఈ శ్రీనివాస్, ఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా బాస్కెట్ బాల్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ ప్లేయర్స్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-13 బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానం వేదికగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై ప్రతిభ నిరూపించుకున్నారు. జిల్లా అండర్-13 బాలుర బాస్కెట్‌బాల్ జట్టును ఖరారు చేశారు. 12 మంది తుది జాబితా, మరో ఇద్దరు స్టాండ్‌బైతో కూడిన 14 మంది జాబితాను కృష్ణమూర్తి వెల్లడించారు. ఇక్కడ ఎంపికైన జిల్లా బాలుర జట్టును ఈ నెల 21 నుంచి 23 వరకు తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం వేదికగా జరగనున్న 8వ ఏపీ రాష్ట్ర అండర్-13 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్, సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, బీ.వీ.ఎస్.ఎన్.రాజు, బాబ్జి పాల్గొన్నారు.

జిల్లా బాలురు జట్టు:

సతివాడ శ్రీహర్ష, గులాబి దేవ, కొమరం పవన్, మెట్ట ప్రణీత్, పట్టాన కిషోర్‌కుమార్, ఉప్పాడ ప్రభాస్, కరగాణ పార్థసాయి, బర్ధాన చైతన్య, బిడ్డిక ప్రదీప్‌కుమార్, చింతాడ చార్లెస్, పుక్కళ్ల తారకేశ్వరరావు, సూరాడ జ్ఞానేశ్వరరావు. స్టాండ్‌బైగా మంత్రి లోకేష్ నాయుడు, గోనాన అఖిల్ ఎంపికైన వారిలో ఉన్నారు.

టీడీపీ నాయకుడి నిర్వాకం!

- జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను అడ్డుకుంటున్న వైనం
- స్థలం తనదేనంటూ ఎదురుదాడి
- తహసీల్దార్‌కు లబ్ధిదారుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు కేటాయించిన స్థలం

ఇచ్ఛాపురం రూరల్: అభివృద్ధికి టీడీపీ నాయకుడు అడ్డంకిగా నిలుస్తున్నాడనే విమర్శలు వస్తున్నాయి. దీనికి ఈ సంఘటనను ఉదాహరణగా చెబుతున్నారు. పేదలందరికీ పక్కా ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీ పేరుతో కొళిగాం రోడ్డు సమీపంలోని రత్తకన్న గ్రామ పరిధి డిగ్రీ కళాశాల ప్రక్కన ఉన్న 197వ సర్వే నంబర్‌లో 102 మంది పేదలకు అధికారులు పట్టాలు ఇచ్చారు. అప్పట్లో ఈ స్థలంపై వివాదం రావడంతో రెవెన్యూ అధికారులు పలుమార్లు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత ప్రభుత్వ స్థలంగా గుర్తించి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2021లో సుమారు రూ. 12 లక్షలు ఖర్చు చేసి రెండు ఎకరాలను చదును చేశారు. 102 మంది లబ్ధిదారుల పేరిట గృహ నిర్మాణశాఖాధికారులు జియో ట్యాగింగ్ కూడా చేశారు. అయితే ఈ స్థలం తనదేనంటూ పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు జగనన్న కాలనీ వద్దకు వెళ్లి లబ్ధిదారులను అడ్డుకోవడంతో వారంతా అవాక్కై య్యారు. ప్రభుత్వం తమకు పట్టాలిచ్చిందని, తామంతా ఇక్కడే ఇళ్లు కట్టుకుంటామంటూ కోరినప్పటికీ ఫలితం కనిపించలేదు. జగనన్న కాలనీ స్థలం తనదేనని, అందుకు తన వద్ద కోర్టు ఆర్డర్ ఉందని చెప్పడంతో లబ్ధిదారులు లబోదిబోమన్నారు. దీంతో లబ్ధిదారులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ ఎం.మీనాకుమారికి వినతి పత్రం అందజేశారు. తమకు న్యాయం చేయాలంటూ కోరారు. స్పందించిన ఆమె మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బందితో మరోమారు సర్వే చేయించి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని చెప్పడంతో వారంతా వెనుదిరిగారు.

ఆపద్బాంధవుడు సీఎం జగన్



క్షీరాభిషేకం కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు

- హయ్యర్ పింఛన్‌పై ఆర్టీసీ ఉద్యోగుల ఆనందం
- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీని ఆదుకున్న ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ అన్నారు. హయ్యర్ పెన్షన్ వర్తింపుపై హర్షం వ్యక్తం చేస్తూ సంబంధిత ఉద్యోగులు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలువెత్తు చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థగా ఉన్న ఆర్టీసీని ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే ప్రభుత్వంలో విలీనం చేశారని గుర్తు చేశారు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం దేశంలో ఏ రాష్ట్రంలో కూడా చేయలేదన్నారు. ఆ పనిని జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లో చేసి చూపారన్నారు. ఇది దేశానికే ఆదర్శమన్నారు. కరోనా సమయంలో కూడా ఏ ఒక్క ఆర్టీసీ ఉద్యోగి కూడా ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సకాలంలో జీతాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. నష్టాలలో ఉన్న ఆర్టీసీని ఆదుకున్న ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిది అయితే ఆయన తనయుడుగా సంస్థను ప్రభుత్వపరం చేసి కార్మికులను ఉద్యోగులుగా చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రాయితీలు, ప్రయోజనాలను ఆర్టీసీకి కూడా అందిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే హయ్యర్ పెన్షన్ పథకం అని పేర్కొన్నారు. ప్రజారవాణాశాఖ నుంచి పీఎఫ్‌కు యథావిధిగా 8.3 శాతం కాంట్రిబ్యూషన్ జమ కావడమే కాకుండా హయ్యర్ పెన్షన్ ఆప్షన్ కేవలం ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రమే దక్కడం సంతోషకరమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఈ పెన్షన్ విశ్రాంత ఉద్యోగికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం అవసరం లేదన్నారు. థాంక్యూ సీఎం సార్ అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ, సీఐలు వి.రమేష్, ఎ.గంగరాజు, స్టేషన్ మేనేజర్ నరేంద్ర, టీఐ-3 ఎల్ఎస్‌నాయుడు, యూనియన్ నాయకులు వి.శాంతరాజు, జి.త్రినాథ్, ఆర్.వి.రావు, ఎండీఏ బాషా, బి.దక్షిణామూర్తి, కె.సుమన్ పాల్గొన్నారు.

కఠినంగా లింగనిర్ధారణ నిషేధ చట్టం అమలు

- ఆంధ్ర, ఒడిశా సరిహద్దు జిల్లాల వైద్యాధికారుల తీర్మానం

అరసవల్లి: లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల వైద్యాధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సంయుక్తంగా తీర్మానం చేశారు. పర్లాకిమిడిలోని సీడీఎంవో కార్యాలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈమేరకు ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ణయాన్ని ప్రకటించారు. పరస్పర సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని తీర్మానించారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగనిర్ధారణ జరుగకుండా తీసుకోవాల్సిన ప్రణాళికలను రూపొందించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వజ్రపుకొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, పలాస తదితర మండలాల్లో స్త్రీల కంటే పురుషులు అధికంగా ఉన్నారన్నారు. స్కానింగ్ చేసేటప్పుడు లింగ నిర్ధారణ చేయకుండా ఆడశిశువుల పుట్టుకలు తగ్గకుండా చూడాలని ఇరు జిల్లాల అధికారులు నిర్ణయించారు. అలాగే విస్తృతంగా పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు జరిపించాలని తీర్మానించుకున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాల్లోని స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా చేపట్టి, ఆకస్మిక తనిఖీలు చేయడంతోపాటు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఆరోగ్య విద్య, బాలికల ప్రాధాన్యత, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను తెలియజేసేలా అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో సీడీఎంహెచ్ (ఒడిశా) డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో, డీఎంవో ప్రదీప్ కుమార్ పాండా, పీసీపీఎన్‌డీటీ కోఆర్డినేటర్ జగదీశ్ పట్నాయక్, శ్రీకాకుళం జిల్లా నుంచి డిప్యూటీ డీఎంహెచ్‌వో అనూరాధ, డెమో పైడి వెంకటరమణ, డిప్యూటీ డెమో వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ, ఎంఆర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బొల్లినేని మెడిస్కిల్స్ (జెమ్స్) నిర్వహిస్తున్న రెండేళ్ల కోర్సు మాస్టరాఫ్ హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేషన్, ఏడాది కోర్సు పీజీ డిప్లమాఇన్ మెడికల్ రికార్డ్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్ర ప్రసాద్ బుధవారం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి నిర్వహించే ఈ కోర్సులకు ఆగస్టు 11వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే రూ. 500 అదనపు రుసుంతో 28వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఒక్కో కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులుగా చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఈడీయు, ఇన్, డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.బొల్లినేని మెడీ స్కిల్స్. ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. అలాగే 79950 13422, 76809 45357 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పేద విద్యార్థులకు సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డులు

- దానేటి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక చేయూత
- ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ వెల్లడి



మాట్లాడుతున్న డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో విద్యావ్యాప్తికి, ప్రతిభగల పేద విద్యార్థులకు దానేటి చారిటబుల్ ట్రస్టు ద్వారా సిక్కోలు ఎక్స్‌లెన్స్ అవార్డుల పేరిట ఆర్థిక చేయూత అందిస్తామని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 10వ తరగతి తత్సమాన పరీక్ష, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, మెడికల్, చార్టెడ్ అకౌంటెంట్స్ తదితర పరీక్షలకు చదువుతున్న వారు ప్రతిభావంతులై ఉండి ఆర్థిక ఇబ్బందులు ఉంటే ప్రోత్సహించడానికి ట్రస్ట్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఉన్నత చదువులు చదివి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. రూ.20 లక్షల రివాల్వింగ్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అర్హత కలిగిన విద్యార్థులను గుర్తించేందుకు విశ్రాంత ప్రొఫెసర్ గుంట తులసీరావు, జామి భీమశంకర్, సుగుణాకర్, జయరాంలతో పాటు వివిధ కళాశాల ప్రిన్సిపాళ్లతో కూడిన తొమ్మిది మంది కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీని ప్రతిభ గల నిరుపేద విద్యార్థులు సంప్రదించాలని కోరారు.

21న మోటివేషనల్ ప్రోగ్రాం..

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహ్మద్ రఫీ ఇటీవల జిల్లాకు చెందిన ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో జయహో పేరిట ఈ నెల 21న మోటివేషనల్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు డాక్టర్ దానేటి శ్రీధర్ తెలిపారు. పాతబస్టాండ్ సమీపంలోని మారుతీ థియేటర్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో విద్యావేత్త జామి భీమశంకర్, సుగుణాకర్, సన్ డిగ్రీ కళాశాల అధినేత జయరాం తదితరులు పాల్గొన్నారు.

శిశు ఆరోగ్యానికి అండగా ఎస్ఎన్‌సీయూ



తల్లీబిడ్డను ఎస్ఎన్‌సీయూ నుంచి డిశ్చార్జ్ చేస్తున్న వైద్యబృందం

సీతంపేట: స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) శిశు ఆరోగ్యానికి అండగా నిలుస్తోంది. తక్కువ బరువు, వివిధ ఆరోగ్య సమస్యలతో జన్మించిన శిశువులకు ప్రాణం పోస్తోంది. ఆమదాలవలస మండలం పొన్నానపేట గ్రామానికి చెందిన గర్భిణి గొడ్డు మాధవి 32 వారాలకే సుఖప్రసవంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కేవలం 1.5 కిలోల బరువు మాత్రమే ఉండి అనారోగ్య స్థితికి శిశువు చేరుకుంది. వెంటనే సీతంపేట ఎస్ఎన్‌సీయూ యూనిట్‌లో గత నెల 24న చేర్పించారు. 26 రోజుల పాటు వైద్యులు ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. కేఎంసీ, వార్మర్ కేర్, విటమిన్‌డి-3, మల్టీ విటమిన్ డ్రాప్స్, ఫొటోగ్రఫీ వంటివి చేయడంతో శిశువు 2.5 కిలోల బరువు పెరిగి ఆరోగ్యకరంగా ఉండడంతో ఎస్ఎన్‌సీయూ నుంచి బుధవారం డిశ్చార్జ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, వైద్యులు వెంకటరావు, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్టుపై ఆర్జేడీ ఆరా



పాతపట్నం: అభినవ్‌తో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

పాతపట్నం:

రొంపివలస గ్రామానికి చెందిన విద్యార్థి రేగేటి అభినవ్ కొత్త జిల్లాలు, రాజధానులు అనే అంశంపై ప్రాజెక్టు రూపొందించాడు. ఈ విషయాన్ని విద్యాశాఖాధికారుల నుంచి తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌లు ఫోన్లో అభినవ్‌తో మాట్లాడి అభినందించారు. ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఆర్జేడీ జ్యోతికుమారిని ఆదేశించారు. దీంతో రొంపివలసలోని అభినవ్ ఇంటికి బుధవారం వెళ్లి ప్రాజెక్టుపై ఆమె ఆరా తీశారు. గ్రామంలోని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం సీది, రొంపివలసలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఎంఈవో శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, రామమూర్తిలు, తిరుపతిరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

24 నుంచి ఏపీఈఏపీసెట్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఉన్నత విద్యాశాఖ ఏపీ ఈఏపీ సెట్ - 2023 (ఎంపీసీ స్ట్రీం) ప్రవేశాల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల చేసినట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం ఇన్‌చార్జ్ గురుగుబెల్లి దామోదర్‌రావు బుధవారం తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 24 నుంచి ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు ఉంటుందన్నారు. సెట్ అర్హత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు సిద్ధం కావాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ఈ నెల 24 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు, ఆన్‌లైన్ వెరిఫికేషన్ ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఉంటుంది. వెబ్ ఆప్షన్ల నమోదు ఆగస్టు మూడు నుంచి ఎనిమిదో తేదీ వరకు ఉంటుంది. అయితే ఆప్షన్ల మార్పునకు ఆగస్టు తొమ్మిదో తేదీ ఒకరు రోజుమాత్రమేనని చెప్పారు. సీట్లు ఎలాట్‌మెంట్ ఆగస్టు 12న, కళాశాలలో రిపోర్టింగ్ ఆగస్టు 13, 14 తేదీల్లో ఉంటుందని పేర్కొన్నారు. తరగతులు ఆగస్టు 16వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వెబ్ సైట్ హెచ్‌టీటీపీఎస్:// సెట్స్.ఏపీఎ సీసీహెచ్‌ఈ.ఏపీ.జీవోవి.ఇన్‌లో పొందు పర్చినట్టు తెలిపారు. హాల్ టిక్కెట్ నంబర్, విద్యార్థుల పుట్టిన తేదీ ఆధారంగా రిజిస్ట్రేషన్ విద్యార్థులు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు, సందేహాలు ఉంటే శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30 నుంచి ఆగస్టు మూడో తేదీ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్సు, గేమ్స్, క్యాప్, ఆంగ్లో ఇండియన్, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఆఫ్‌లైన్ ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావల్సి ఉంటుందన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,650-00
బంగారం(22కి. 10గ్రా.)	55,600-00
వెండి (కిలో)	82,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204